తమిళంలో ఎమ్జీయార్‌కి పోటీ యిచ్చిన నటుడు శివాజీ గణేషన్. అతను కేవలం నటుడు మాత్రమే కాబట్టి అన్ని రకాల పాత్రలూ వేశాడు. కుంటి, గుడ్డి, విషాద, ఉన్మాద, వృద్ధ – పాత్ర ఎంత వైవిధ్యంతో వుంటే అంత సరదా అతనికి. అతను వేసిన అనేక పాత్రలను తెలుగులో ఎన్టీయార్ వేశారు. విలన్ షేడ్స్ వున్న పాత్రలు, చనిపోయే పాత్రలు, ముసలి పాత్రలు, తాగే పాత్రలు, వ్యభిచరించే పాత్రలు.. ఏవైనా సరే, తనలో నటన వెలికి రావాలని చూసుకున్నాడు కానీ, యిలా గిరి గీసుకుని ఒక తరహా పాత్రలే వేస్తానని కూర్చోలేదు. అందుకని ఎన్టీయార్‌ను నటుడిగా ఎమ్జీయార్‌తో పోల్చడం సరికాదు.

ఎన్టీయార్ ఎమ్జీయార్ తరహా పాత్రలు వేయడం మొదలు పెట్టినది “అడవి రాముడు” సినిమానుండే ! అక్కణ్నుంచి చూడండి – ఇద్దరేసి హీరోయిన్లు, రంగురంగుల దుస్తులు, కోట్లు, టోపీలు, తుపాకీలు, ఓవరాక్షన్‌లు.. అతన్ని ఎవరూ కొట్టలేరు. ఓడించాలంటే అతను నిద్రపోతూండగా ఎత్తుకు పోవలసినదే. .. ఈ తరహా పాత్రలు ఎన్టీయార్‌ను యువతరానికి చేరువ చేశాయి. నిజానికి 1983 ఎన్నికలలో ఎన్టీయార్‌ను గెలిపించినది యీ తరహా పాత్రలే.. పౌరాణిక పాత్రలు కాదు. ఎందుకంటే 1983కు ముందు ఐదేళ్లగా విడుదలైన ఎన్టీయార్ పౌరాణికాలన్నీ ఫ్లాప్.

ఇక వ్యక్తిగా ఎమ్జీయార్ పద్ధతి ఎలా వుండేదో కొన్ని ఉదాహరణలు చెప్తాను. ఎన్టీయార్‌లో యీ లక్షణాలు వున్నాయో లేదో మీరే చెప్పుదురుగాని. ఎమ్జీయార్ దరిద్రంలో పెరిగాడు. తిండి లేకపోవడం అంటే ఏమిటో అతనికి తెలుసు. పేదలు కనబడితే వాటేసుకునేవాడు. ఎమ్జీయార్ ఓ ముసలమ్మను వాటేసుకున్న ఫోటో ఏదైనా చూడండి. దానిలో నటన కనబడదు. ఫోటో తీయడం అయిపోగానే వెళ్లి డెట్టాల్‌తో కడుక్కుంటాడా అనిపించదు. నిజమైన అక్కర కనబడుతుంది. ఎవరైనా కనబడితే అతను అడిగే మొదటి ప్రశ్న – “భోజనం చేశావా?”.

ఎమ్జీయార్ మహాదాత. ఇప్పుడు ఏదో యిస్తున్నాం, తర్వాత ముఖ్యమంత్రి అయిన తర్వాత తిరిగి సంపాదించవచ్చు అనే లెక్కతో చేసిన దానాలు కావవి. తను ముఖ్యమంత్రి అవుతానని అతను ఎన్నడూ ప్లాన్ చేయలేదు. అతనికి పిల్లలు లేరు. చదువుకునే పిల్లలకు స్కాలర్‌షిప్‌లు యిచ్చి ప్రోత్సహించేవాడు. తన మిత్రుడు కావచ్చు, శత్రువు కావచ్చు వచ్చి అడిగితే కాదనే ప్రశ్నే లేదు. అతనంటే అస్సలు పడని చో రామస్వామి ఓసారి చెప్పాడు – “ఓ సారి ఓ నటుడు నాకు చెప్పాడు – అడిగితే ఎమ్జీయార్ ఏదీ కాదనడన్న నమ్మకం ఎంత గట్టిదంటే ఎసరుకై నీళ్లు పడేసి అతని దగ్గరకు వెళితే బియ్యంతో తిరిగి రావచ్చు.” అని.



సిగరెట్టు తాగకపోవడం, మద్యం తీసుకోకపోవడం అతను తెరపైనే కాదు, నిజజీవితంలోనూ చేయలేదు. కనబడిన వాళ్లందరికీ ఆ అలవాట్లు మానమని చెప్పేవాడు. తన చుట్టూ వున్న వారు ఎవరైనా సరే సిగరెట్టు తాగకూడదు, మద్యం సేవించకూడదు అని నిబంధన పెట్టేవాడు. ఎంత అలవాటున్నా అతని డైరక్టర్లు అతని ఎదుట సిగరెట్టు తాగడానికి వీల్లేదు. (“ఉరిమై కురళ్” సినిమా టైములో ‘చిత్రాలయా’ శ్రీధర్‌కు మాత్రం యీ విషయంలో మినహాయింపు దొరికిందని అంటారు)

ఎన్.ఎస్.కృష్ణన్ చాలా పాప్యులారిటీ వున్న హాస్యనటుడు. అతనూ అతని భార్య టిఎ మధురం కలిసి వెండితెరను కొన్నాళ్లపాటు ఏలారు. ఎమ్‌జిఆర్ కష్టకాలంలో వున్నపుడు కృష్ణన్ అతన్ని ఆదుకున్నాడు. అతనికి తాగుడు అలవాటుండేది. ఎమ్జీయార్ పెద్దనటుడయ్యాక ఓ రోజు సాయంత్రం మీ యింటికి వస్తున్నానంటూ కృష్ణన్‌కు కబురు పెట్టాడు. అప్పటికే కృష్ణన్ సరంజామా అంతా పరుచుకుని కూర్చున్నాడు. ఇతని రాక గురించి వినగానే “అన్నీ లోపల సర్దేయండ్రా” అన్నాడు. ఎమ్జీయార్ వచ్చాడు, వెళ్లాడు. మళ్లీ అన్నీ బయటకు సర్దుకుంటూ వుంటే అంతలో యింకో డైరక్టరు వస్తున్నట్టు కబురు వచ్చింది. “మళ్లీ లోపల సర్దేయండ్రా” అన్నాడు కృష్ణన్. పక్కనున్న అసిస్టెంటు అడిగాడు – “ఎమ్జీయారయితే తాగుడు వల్ల అనర్థములు అంటూ స్పీచి యిచ్చి చంపుతాడని తెలుసు. కానీ యిప్పుడు వచ్చే అతను తాగేవాడేగా, భయం దేనికి?” అని. అప్పుడు కృష్ణన్ చెప్పాడు – “ఎమ్జీయార్ అలా చంపితే వీడు యింకోలా చంపుతాడు. మొత్తమంతా వాడే తాగేసి నాకు చుక్క కూడా మిగల్చడు”!

గోర్కీ అనే ఓ ఫ్రీలాన్సు జర్నలిస్టు వుండేవాడు. ఎమ్జీయార్ డిఎంకెలో వుండగా పార్టీ మీటింగులు కవర్ చేయడానికి కూడా వెళుతూండేవాడు. అతనికి వున్న పెద్ద వీక్‌నెస్ తాగుడు. ఎమ్జీయార్ ఎంత చెప్పినా వినేవాడు కాదు. ఓ సారి వాళ్లిద్దరూ బొంబాయిలోని షణ్ముఖానంద హాలులో ఓ భరతనాట్య ప్రదర్శన చూడడానికి వెళ్లారు. పక్కపక్కన కూర్చుని చూశాక హోటల్‌కు తిరిగి వెళుతూ ఎమ్జీయార్ అడిగాడు – “ఎలా వుంది?” అని. “ఎక్సలెంట్‌గా వుంది. నేను బొంబాయిలో వున్నట్టే ఫీలవలేదు. తంజావూరులో ఓ అగ్రహారంలో భరతనాట్యం చూస్తున్నట్టు అనిపించింది” అన్నాడు. ఎమ్జీయార్ “నాకు మాత్రం కల్లుమాత్రం కల్లు పాకలో కూర్చునట్టుంది. ” అన్నాడు ఎమ్జీయార్.

ఇలా ఎన్నిసార్లు ఎత్తి పొడిచినా అతను తాగుడు మానలేదు. చివరకు చేతులు వణికి ఏమీ రాయలేని స్థితికి వచ్చాడు. చెప్తూంటే

మానటం లేదని చివరకు ఎమ్జీయార్ అతన్ని బలవంతంగా ఓ ఆస్పత్రిలో చేర్పించేసి ఆపరేషన్ చేయించాడు. ఖర్చులన్నీ ఎమ్జీయార్‌వే. అక్కడితో ఆగలేదు. కొన్ని నెలల తర్వాత గోర్కీ భార్యకు చచ్చేటంత జబ్బు చేసింది. చేతిలో డబ్బు లేదు. అది అతను అర్ధరాత్రి 2.30 కి ఫోన్ చేసి ఎమ్జీయార్‌కి చెపితే ఎమ్జీయార్ అంతా విని ధైర్యం చెప్పి తన స్వంత డాక్టర్ను ఆమె వద్దకు పంపి వైద్యం చేయించాడు. ఖర్చులన్నీ ఎమ్జీయార్‌వే అని చెప్పనక్కరలేదు. గోర్కీ తాగుడు మానివేయడమే కాదు "ఇది ఎమ్జీయార్ ప్రసాదించిన జీవితం" అని చేతిమీద పచ్చ పొడిపించుకున్నాడు. (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**